

భానుడి ప్రతాపం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: సూర్య భానుడి ప్రతాపానికి మండలంలో ఎండలు తీవ్రంగా మండుతున్నాయి. దీంతో, మధ్యాహ్నం సమయంలో మండల వాసులు బయటకి రావడానికి భయపడుతున్నారు. వివిధ అత్యవసర పనులు ఇంతే తప్ప మిగిలిన వారు బయటకు రాకుండా నివాస గృహంలోనే ఉండిపోతున్నారు. దీంతో మండలంలోని ప్రధాన రోడ్లు జనాలు లేక నిర్మానుష్యంగా కనబడుతున్నాయి. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. ఎండల తీవ్రత నుంచి ఉపశమనం పొందడానికి కొంతమంది చెట్టు నీడలను ఆశ్రయించి ఉపశమనం పొందుతుండగా చిన్నారులు గెడ్డ వాగుల్లో స్నానాలు చేస్తూ వేసవి తాపానికి సేద తీరుతున్నారు.



నిర్మానుష్యంగా ఉన్న రోడ్డు

బిజెపితో పొత్తు, తొత్తు పార్టీలను ఓడించి..

సిపిఎం అభ్యర్థులను గెలిపించాలి

పార్టీ జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స

ప్రజాశక్తి-చింతపల్లి: బిజెపితో పొత్తు పెట్టుకున్న తొత్తు పార్టీలను ఓడించి సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ అల్లూరి జిల్లా కార్యదర్శి పి అప్పలనర్స కోరారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బోనంగి చిన్నయ్య పడాల్‌తో కలిసి స్థానిక విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బిజెపి ప్రమాదాన్ని తక్కువగా అంచనా వేయకూడదని సూచించారు.భారత రాజ్యాంగాన్ని మార్చడమే లక్ష్యంగా బిజెపి ముందుకు వెళుతుందని, అందుకే 400 సీట్లు ఇస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తాం అని బహిరంగంగా బిజెపి నేతలు చెబుతున్నారని తెలిపారు. ఇప్పటికే వ్యవస్థలన్నీ నాశనం చేసిందని మండిపడ్డారు. ప్రభుత్వ రంగ సంస్థల నిర్వీర్యంతో లక్షలాది మంది ఉద్యోగాల నుండి తొలగింపబడ్డారన్నారు. అంబానీ, ఆదానిలకు అడవులను అప్పగించేందుకు బిజెపి కుట్ర చేస్తుందని విమర్శించారు. ఆ పార్టీలు గెలిస్తే మళ్లీ బాక్సైట్ తెరమీదకి వచ్చే ప్రమాదం ఉందని, ఈ ప్రాంతంలో హైడ్రో పవర్ ప్రాజెక్ట్ ఏర్పాటు చేస్తారన్నారు. అందుకే ఏజెన్సీలో పోటీ చేయడానికి మిగతా పార్టీలు తహతలాడుతున్నాయన్నారు. రాష్ట్రానికి విభజన హామీలలో భాగంగా రావలసిన రాయితీలు ఇవ్వకుండా బిజెపి అడ్డుపడుతుంటే, అటువంటి పార్టీని భుజాల మీద ఎక్కించుకొని పల్లకిలో మోస్తున్నారని దుయ్యబట్టారు. బిజెపి తొత్తు పార్టీలను ఓడించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం చింతపల్లి మండల కార్యదర్శి పాంగి ధనుంజయ్, సాగిన చిరంజీవి, సిదరి సత్తిబాబు, సర్బు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సీలేరు: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి పొత్తు, తొత్తు పార్టీలను ఓడించాలని, సిపిఎం అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బోనంగి చిన్నయ్య పడాల్ పిలుపునిచ్చారు. చింతపల్లి, జికె.వీధి, కొయ్యూరు మూడు మండలాల సిపిఎం కార్యకర్తలతో గాలికొండ ఎంపీటీసీ సభ్యులు అంపరంగి బుజ్జిబాబు అధ్యక్షత జీకే వీధి మండలం రింతాడలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నయ్యపడాల్ మాట్లాడుతూ, ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసి, లక్షలాది మంది ఉద్యోగులను తొలగించిందని చెప్పారు. చివరికి గిరిజనులకు ఆధారంగా ఉన్న అడవులను సైతం అదాని, అంబానీలకు అప్పగించే కుట్ర చేస్తుందని తెలిపారు. ఎర్రజెండా పార్టీ వాళ్ళు ఎక్కడ పోటీ చేసినా భారీ స్థాయిలో ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం చింతపల్లి మండల కార్యదర్శి పాంగి ధనుంజయ్, కొయ్యూరు మండల కార్యదర్శి ఎస్.సూరిబాబు, నాయకులు చిరంజీవి, బాలయ్య, అమ్మవారి దారకొండ వైస్ సర్పంచ్ మురళి చంటిబాబు, కోటేశ్వరరావు, రాంబాబు, సింహాచలం, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం నేతల ప్రచారం

హుకుంపేట: సిపిఎం అరకు ఎంపి, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలని మండలంలోని తీగలవలస పంచాయితీ గుర్రాలతోట, రాతుల పుట్టు, దుగ్గం, తడిగిరి పంచాయితీ ముల్లు మెట్ట గ్రామాల్లో హుకుంపేట వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావుల ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు.ప్రజల కోసం పనిచేసే సిపిఎంను ప్రజలు ఆదరించి శాసనసభకు పంపాలన్నారు. ఈ కార్యక్రమంలో తడిగిరి వైస్ సర్పంచ్ కిల్లో రామారావు, పాంగి సోమన్న, మర్రి చిట్టిబాబు, శివ, మజ్జి కొండబాబు, కిల్లో నాగేశ్వరరావు, కిల్లో బుజ్జిబాబు, వాసు,తదితరులు పాల్గొన్నారు.



బైక్ ర్యాలీ చేపడుతున్న నాయకులు



వైద్య ఆరోగ్య శాఖ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే

ప్రతి గ్రామంలోనూ ఫీవర్ సర్వేలు

ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే ఆదేశం

ప్రజాశక్తి-రంపచోడవరం

ఏజెన్సీలోని ప్రతి గ్రామంలోనూ ఫీవర్ సర్వేలు చేయాలని రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే సంబంధిత వైద్యాధికారులను ఆదేశించారు. స్థానిక ఐటిడిఎ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో పిఒ సూరజ్ గనోరే సోమవారం అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, ఎడిఎంహెచ్ఒ, మలేరియా ఎఎంఒ తదతిరులతో మలేరియా ఫీవర్ సర్వే, మలేరియా నివారణకు మలాథియన్ స్ప్రేయింగ్‌పై వీడియా కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలోని ప్రతి ఇంటికీ వెళ్లి మలేరియా ఫీవర్ కేసులు గుర్తించి రక్త నమూనాలు ఆర్‌డి కిట్ల ద్వారా స్వీకరించాలని, మలేరియా జ్వరం ఉన్న వారికి అక్కడికక్కడే ఉచితంగా మందులు అందజేయాలని ఆదేశించారు. మలేరియా స్ప్రేయింగ్ ఎక్కడికక్కడ చేయించే విధంగా సంబంధిత వైద్యాధికారులు పర్యవేక్షించాలన్నారు. ఏజెన్సీలో మలేరియా జ్వరాలు పెరగకుండా ఇప్పటి నుండి తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. మలేరియా జ్వరాలకు సంబంధించిన వివరాలు ఎప్పటికప్పుడు సంబంధిత రిజిస్టర్లో నమోదు చేయాలన్నారు. వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో ఈ ఏడాదిలో ఇప్పటివరకు మలేరియా కేసులు ఎన్ని నమోదయ్యాయో ఆరా తీశారు. బర్త్ వెయిటింగ్ హాల్లో ఉన్న గర్భిణులకు మంచి ఆహారం సరఫరా చేయాలని ఆదేశించారు. మారుమూల ప్రాంతంలో ఉన్న పిహెచ్‌సిల్లోని బర్త్ వెయిటింగ్ హాల్లో ఉన్న గర్భిణుల కోసం ఏసీ, టీవీలు అవసరమనుకుంటే ఐటీడీఏ నుండి ఏర్పాటు చేయడానికి తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ ఏడాది మలేరియా కేసులు ప్రబలకుండా ఎక్కడికక్కడ సిబ్బందిని ఏర్పాటు చేయడానికి తగు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ఈ కాన్ఫరెన్స్‌లో ఎడియంహెచ్‌ఓ జి.ప్రకాశం, మలేరియా ఏఎంవో నక్క వెంకటేశ్వరరావు, ఎంపిహెచ్‌ఓ పీటర్, వైద్యాధికారులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలని..

సిపిఎం నేతల నిరసన

ప్రజాశక్తి-అరకులోయరూరల్: మండలంలోని మాదల పంచాయతీ మారుమూల దాబుగుడ గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం మహిళలు, సిపిఎం నాయకులు కుళాయి వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకుడు కుమిడి రమేష్ మాట్లాడుతూ, గ్రామంలో సుమారు 50 కుటుంబాలు నివసిస్తున్నాయని, కనీసం తాగు నీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎన్నిసార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకునే పరిస్థితి లేదని విమర్శించారు. తాగునీరు లేక బురద నీటిని తాగవలసిన పరిస్థితి నెలకొందని, దీంతో అనారోగ్యం పాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు, ఎమ్మెల్యేలు, ఎంపిలు మారినా గ్రామంలో తాగునీటి సమస్యలపై ఎవ్వరు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సిపిఎం బలపరిచిన ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపిస్తేనే గ్రామంలో తాగునీరు, వివిధ సమస్యలపై పోరాడి సాధిస్తామన్నారు. బిజెపి, వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు గిరిజన హక్కులు చట్టాలు నిర్వీర్యం చేశాయని, ఇలాంటి పార్టీలను ఈ ఎన్నికల్లో ఓడించాలని కోరారు. ప్రజా సమస్యలు, గిరిజన హక్కులు, చట్టాలను కాపాడే సిపిఎం అభ్యర్థులకు ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించి చట్టసభలకు పంపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మాదల గ్రామ పంచాయతీ సీపీఎం కార్యదర్శి కొర్ర అప్పన్న, సిరగం ప్రసాద్, సిరగం సొన్ను, సిరగం కోములు, పాంగి రాము, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న నాయకులు



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న తహశీల్దారు వెంకట రమణరావు

ఓటు హక్కు వినియోగంపై అవగాహన

ప్రజాశక్తి -మారేడుమిల్లి : మండలంలో సున్నంపాడు పంచాయతీ రామన్నవలస గ్రామంలో సోమవారం మండల తహసీల్దార్ ఎ.వెంకట రమణరావు ఆధ్వర్యంలో ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రతి పౌరుడు తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని సూచించారు. 18 సంవత్సరాలు నిండిన వారు తమ ఓటును నమోదు చేసుకోవాలన్నారు. ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా ఓటును వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం ఆర్ఐ ఏసుబాబు, పంచాయతీ సెక్రటరీ దేవిశ్రీ శబరి, విఎపి వరప్రసాద్, విఎహెచ్ ఏ సత్తిబాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విఆర్.పురం : ఓటు చాలా విలువైనదని, ఓటర్లు తమ ఓటు నిర్భయంగా వేయాలని మండల తహసీల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్ అన్నారు. మండలంలోని జీడిగుప్ప, కోటారిగొమ్ము గ్రామాల్లో ఓటు వినియోగంపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన ఓటు ఆవశ్యకత వివరించారు. ఓటు వేయడం ప్రజాస్వామ్య వ్యవస్థలో అద్భుతమైన అవకాశమని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రవ్వా రామయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సిహెచ్‌సికి క్షయ వ్యాధి నివారణ మందులు

- ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-అడ్డతీగల

'క్షయ వ్యాధికి మందులు కొరత' అనే శీర్షికన మార్చి 30వ తేదీ శనివారం ప్రజాశక్తి ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు అడ్డతీగల సామాజిక ఆరోగ్య కేంద్రానికి క్షయ వ్యాధి నివారణకు సంబంధించిన మందులను పంపించినట్లు డాక్టర్ సతీష్ సోమవారం తెలిపారు. జిల్లాలు విడిపోయిన దగ్గర నుండి మందులు ఒకసారి కాకినాడ నుండి, మరోసారి పాడేరు నుండి రావడంతో ఈ ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ఇకపై అటువంటి ఇబ్బందులు రాకుండా అధికారులు సూచనలు చేశారని డాక్టర్ సతీష్ చెప్పారు.

గోదావరి డెల్టాకు నీరు విడుదల

ప్రజాశక్తి -సీలేరు : గోదావరి డెల్టా రబీ పంటకు సీలేరు కాంప్లెక్స్ పరిధి డొంకరాయి జలాశయం రెండు గేట్లు ద్వారా సోమవారం సాయంత్రం 5 గంటల నుంచి 3000 క్యూసెక్కులు నీటిని నేరుగా గోదావరిలోకి విడుదల చేస్తున్నామని ఏపీ జెన్కో ఎస్ఇ సివిల్ కేకేవి.ప్రశాంత్ కుమార్ వెల్లడించారు. స్థానిక విలేకరులతో సోమవారం ఆయన మాట్లాడుతూ సీలేరు కాంప్లెక్స్ పరిధిలోని సీలేరు, డొంకరాయి, పోల్లూరు జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి అనంతరం 4000 క్యూసెక్కులు నీరు గోదావరి డెల్టాకు చేరుతుందని తెలిపారు. గోదావరి రబీ పంటకు ఇరిగేషన్ అధికారులు అదనంగా మరో 3000 క్యూసెక్కులు నీటిని విడుదల చేయాలని కోరగా వారి విన్నపం మేరకు ఏపీ జెన్కో ఉన్నతాధికారి ఆదేశాల మేరకు డొంకరాయి జలాశయం గేట్లు ద్వారా నేరుగా ఈనెల 6వ తేదీ సాయంత్రం వరకు గోదావరికి నీటి విడుదల కొనసాగుతుందని పేర్కొన్నారు. ప్రస్తుతం బలిమెల జలాశయంలో ఆంధ్ర వాటా 17 టీఎంసీలు ఉండగా గుంటవాడ జలాశయం, దిగు సీలేరు డొంకరాయి జలాశయంలో 11 టీఎంసీలు కలుపుకొని మొత్తం 28 టీఎంసీలు నీటి నిల్వలు ఉన్నాయని పేర్కొన్నారు. తమకున్న నీటి నిల్వలను గోదావరి డెల్టాకు సాగునీరు, విద్యుత్ ఉత్పత్తికి, తాగునీటి అవసరాలకు పొదుపుగా వినియోగించుకుంటామని తెలిపారు. సీలేరు కాంప్లెక్స్‌లో విద్యుత్ ఉత్పత్తి గ్రిడ్ ఆదేశాలకు అనుగుణంగా నిరాటంకంగా జరుగుతుందని ప్రశాంత్‌కుమార్ చెప్పారు.



డొంకరాయి జలాశయం గేట్లు స్విచ్ ఆన్ చేసి నీటిని విడుదల చేస్తున్న చీఫ్ ఇంజనీర్ శ్రీధర్




ర్యాలీ చేస్తున్న టిడిపి నాయకులు

గిడ్డి ఈశ్వరికి టికెట్ ఇవ్వాలని

టిడిపి నేతల భారీ ర్యాలీ

ప్రజాశక్తి -పాడేరు: పాడేరులో మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరికి టిడిపి సీటు కేటాయించాలని, అభ్యర్థి ఎంపికలో అధిష్టానం పునరాలోచన చేయాలని కోరుతూ నియోజకవర్గంలోని ఐదు మండలాల పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుచరులు పట్టణ వీధుల్లో. సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. పాడేరు టికెట్ గిడ్డి ఈశ్వరికి కేటాయించాలని అనుచరులు డిమాండ్ చేశారు. లేదంటే పాడేరు నియోజకవర్గం అభ్యర్థి, అరకు ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీతను కూడా ఓడిస్తామని అనుచరులు హెచ్చరించారు. గిడ్డి ఈశ్వరి నివాసం నుండి మొదలైన ర్యాలీ ఐటీడీఏ, పాత బస్టాండ్, బజార్ మీదుగా పురవీధుల్లో కొనసాగింది. పాడేరు నియోజకవర్గం 5 మండలాల్లో నుండి మండల అధ్యక్షులు అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే భాగ్యలక్ష్మికి ఖురాన్‌ను ఇస్తున్న ముస్లిములు

ఘనంగా ఇఫ్తార్ వేడుకలు

ప్రజాశక్తి-చింతపల్లి: రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని కుల మతాలకు అతీతంగా ముస్లింలు స్థాని మసీదులో ఇఫ్తార్ విందును ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాడేరు శాసనసభ్యురాలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు, తెదేపా పాడేరు నియోజకవర్గ అభ్యర్థి కిల్లు రమేష్ నాయుడు, స్థానిక జడ్పిటిసి సభ్యుడు పోతురాజు బాలయ్య, ఎంపీపీ కోరాబు అనూష దేవి, బోయిన కుమారి, చింతపల్లి, బలపం సర్పంచ్ లు దురియా పుష్పలత, కొర్ర రమేష్ నాయుడు, ఎంపీటీసీ సభ్యురాలు దాసరి ధారలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పరదా నీడలో విద్యాభ్యాసం

- ఎండకు, వానకు ఇబ్బంది పడుతున్న పిల్లలు
- పదేళ్లగా అసంపూర్తిగా ఉన్న పాఠశాల భవనం
- పట్టించుకోని పాలకులు, అధికారులు



పరదా నీడలో పాఠశాలను నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి -సీలేరు

పాలకులు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఏజెన్సీలోని కనీసం పాఠశాల భవనాలు లేక గిరిజన విద్యార్థులు పూరి గుడిసెలు, పరదాల నీడలో విద్యాబుద్ధులు నేర్చుకోవలసిన దుస్థితి నెలకొంది. రాజకీయ నాయకులు తలరాతలు మారుతున్నా తమ తమ పిల్లలు తలరాతల మారడం లేదని గిరిజనులు వాపోతున్నారు. ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యానికి జికె.వీధి మండలం బంధవీధిలో పదేళ్లగా పాఠశాల భవనాన్ని అసంపూర్తిగా విడిచిపెట్టడమే నిదర్శనం.

జీకే వీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ బందవీధి గ్రామంలో ఒకటి నుంచి ఐదు తరగతి వరకు సుమారు 30 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఇద్దరు ఉపాధ్యాయులను ప్రభుత్వం నియమించింది. స్కూల్ భవనం లేక కర్రలు, పరదాతో కట్టిన చిన్న పాకలో గిరిజన బాలలు చదువుకోవాల్సి వస్తోంది. ఎండా కాలంలో ఎండుతూ, వానా కాలంలో తడుస్తూ విద్యార్థులు నానా అగసాట్లు పడుతున్నారు. వీరికి విద్యాబుద్ధులు నేర్పించడానికి ఉపాధ్యాయులు అప్పారావు, లలిత ఎంతో శ్రమిస్తున్నా, పిల్లలు శ్రద్ధగా పాఠాలు వినే వాతావరణం లేని దుస్థితి నెలకొంది.

పదేళ్ల క్రితం కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు స్కూల్ భవనానికి నిధులు మంజూరు చేశారు. సంబంధిత గుత్తేదారుడు నిర్మాణ పనులు చేపట్టి పనులు పూర్తి చేయకుండా అసంపూర్తిగా నిలిపివేశారు. అప్పుటి నుంచి విద్యార్థులకు స్కూలు భవనం లేక అనేక ఇబ్బందులు గురవుతున్నారు. నిధులు వృధా అయ్యాయే తప్ప విద్యార్థులకు ఎటువంటి ప్రయోజనం చేకూరలేదని తల్లిదండ్రులు చెబుతున్నారు. రాజకీయ నాయకులకు, ప్రభుత్వ అధికారులకు అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్, ఐటిడిఎ పిఒకు తమ గ్రామంలో స్కూల్ భవనం లేదని విన్నవించినా చర్యలు చేపట్టలేదని విద్యార్థులు తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. భవనం నిర్మించడానికి అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

మారుమూల ప్రాంతంలో గిరిజనులకు విద్య, వైద్యం, పూర్తిస్థాయిలో సకల సౌకర్యాలు కల్పిస్తున్నామని చెప్పుకున్న ప్రభుత్వాలు, అధికారులకు తమ గ్రామంలో పిల్లలకు పాఠశాల భవనం ఏర్పాటు చేయాలని తెలియదా? అంటూ ప్రశ్నించారు. వైసిపి ప్రభుత్వం నాడు-నేడు పనులలో భాగంగా నిధులు వెచ్చించి స్కూల్ భవనాలు నిర్మించి ఉండి ఉంటే ప్రస్తుతం తమ పిల్లలకు ఈ దుస్థితి ఉండేది కాదని వాపోయారు. తమ గ్రామంలో వైసిపి ప్రభుత్వ హయాంలో అభివృద్ధి కార్యక్రమాలు చేయలేదని వాపోయారు. రానున్న రోజుల్లో వర్షాలు వస్తే విద్యార్థులకు ఎక్కడ విద్యను నేర్పాలని ఉపాధ్యాయులు తలలు పట్టుకుంటున్నారు. కనీసం ఎంఈఓ కూడా సమస్యలపై దృష్టి సారించకపోవడం పట్ల మండిపడుతున్నారు. ఇప్పటికైనా కలెక్టరు, ఐటిడిఎ పిఒ, ఇతర అధికారులు స్పందించి బంధవీధి గ్రామంలో పాఠశాల భవనాన్ని నిర్మించాలని విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు.



పదేళ్లగా అసంపూర్తిగా నిలిచి పోయిన పాఠశాల భవనం

నవోదయకు శాంతి పాఠశాల విద్యార్థి ఎంపిక



ప్రజాశక్తి-చింతూరు : చింతూరు డివిజన్ కేంద్రంలో ఉన్న శాంతి పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న చూటూరు గ్రామానికి చెందిన విద్యార్థి పూరి మన్విత నవోదయలో ఆరో తరగతి ప్రవేశానికి అర్హత సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ రజినీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నవోదయ ప్రవేశ పరీక్షకు తమ పాఠశాలలో శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. విద్యార్థిని ఎంపిక పట్ల పాఠశాల సిబ్బంది స్థానికలు హర్షం వ్యక్తం చేశారు. తమ కుమార్తె జవహర్ నవోదయ విద్యాలయంలో సీటు సాధించడంపై మన్విత తల్లిదండ్రులు పాఠశాల ప్రధానోధ్యాయురాలు యామినికి, పాఠశాల బోధన సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.

సుబ్బారావుకే టిక్కెట్ కేటాయించాలి



నినాదాలు చేస్తున్న కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు

ప్రజాశక్తి-చింతపల్లి:కాంగ్రెస్ పార్టీ పాడేరు నియోజకవర్గ టిక్కెట్ వంతల సుబ్బారావు కేటాయించాలని అంజలి శనివారం పంచాయితీ కుడిసింగి గ్రాములు కోరారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అధ్యక్షులు వంతల సుబ్బారావుకు కాకుండా వేరే వ్యక్తులకు టిక్కెట్ కేటాయించనున్నారని ప్రచారం నేపథ్యంలో ఆ పంచాయతీలోని పలు గ్రామాల ప్రజలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,నియోజకవర్గంలో పార్టీ బాధ్యతలు చేపట్టిన వంతల సుబ్బారావు పార్టీకి పూర్వవైభవానికి తీసుకొచ్చేందుకు ఎంతో కృషి చేశారన్నారు. ఆయన కృషితో చింతపల్లి మండలం నుండి ఇద్దరు ఎంపీటీసీలు కాంగ్రెస్ పార్టీ నుండి గెలుపొందారని గుర్తు చేశారు. ఆయనకు కాకుండా కాంగ్రెస్ పార్టీ టిక్కెట్ ఎవరికి కేటాయించిన ఓడిపోవడం ఖాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో వంతల చిరంజీవి, కిల్లో జోగిరాజు, కిల్లో రాజబాబు, కిల్లో వెంకటప్పారావు, వంతల భాస్కరరావు, గెమ్మెలి బాలరాజు, కిల్లో కేశవరావు, కొర్ర రంగన్న, కొర్ర తిరుపతి, గెమ్మెలి సుబ్బారావు, గెమ్మెలి డేవిడ్, గెమ్మెలి కుమారి, వంతల ప్రసన్న, గెమ్మెలి కొండమ్మ తదితరులు పాల్గొన్నారు.

'స్థలాన్ని మాకే కేటాయించాలి'



మాట్లాడుతున్న వెలుగు సిబ్బంది

ప్రజాశక్తి-హుకుంపేట:మండల కేంద్రంలో వెలుగు కార్యాలయానికి ఇచ్చిన స్థలాన్ని తమకు ఇప్పించాలని వెలుగు సిబ్బంది సోమవారం కోరారు. గతంలో కార్యాలయానికి ఇచ్చారన్నారు. సోమవారం తమ కార్యాలయ స్థలాన్ని గిరిజనేతరులు బుడ్డిగా కొండమ్మకు అధికారులు ఇవ్వడం సరికాదన్నారు. ప్రభుత్వ స్థలానికి కాపాడవలసిన అధికారులే గిరిజనేతరులకు రహదారి కోసం స్థలం కేటాయించడం సరికాదన్నారు.

వాలంటీర్ల సెల్‌ఫోన్లు వాపసు

ప్రజాశక్తి - చింతపల్లి: రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గ్రామ వాలంటీర్లు సెల్ ఫోన్లను సోమవారం అధికారులకు అప్పగించారు. మండలంలోని 22 గ్రామ సచివాలయాలలో విధులు నిర్వహిస్తున్న 421 మంది గ్రామ వాలంటీర్లు ఆయా సచివాలయ కేంద్రాల్లో సచివాలయాల సిబ్బందికి అప్పగించారు.



సెల్‌ఫోన్లు తిరిగి ఇచ్చేస్తున్న వాలంటీర్లు

సిపిఎం కార్యకర్తల పార్టీ మార్పు అవాస్తవం



మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-ముంచంగిపుట్టు: మండలంలోని వనుగుమ్మ గ్రామ సిపిఎం కార్యకర్తలు వైసిపి పార్టీలో చేరారని చెప్పడం అవాస్తవమని ఆ పార్టీ మండల కార్యదర్శి భీమరాజు, జిల్లా కమిటీ సభ్యులు కొర్ర త్రినాథ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వనుగుమ్మ గ్రామ పంచాయితీ పరిధిలో వైసిపి ఎన్నికల ప్రచారంలో భాగంగా జిల్లా పరిషత్ చైర్ పర్సన్ సుభద్ర, ఎమ్మెల్యే అభ్యర్థి మత్స్యలింగం సమక్షంలో సిపిఎం కార్యకర్తలు వైసిపి పార్టీలో చేరారని ఆ పార్టీ సోషల్ మీడియాలో చేస్తున్న దుష్ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వారు చేస్తున్న ప్రచారం నిజం కాదని తెలిపారు.వైసిపిలో చేరిన వారు సిపిఎం, ప్రజా సంఘాలల్లో ఎటువంటి సభ్యత్వం పొందలేదని స్పష్టం చేశారు. అవాస్తవలను సృష్టించి దుష్ప్రచారం చేసుకోవడం వైసిపి నైజమని విమర్శించారు. సిపిఎం కార్యకర్తలు, అభిమానులు ఏ పార్టీలో చేరరని తెలిపారు. ఈ సమావేశంలో సీపీఎం సీనియర్ నాయకులు ఎస్.గాసిరం దొర, వనుగుమ్మ శాఖ సభ్యులు కె.విక్రమ్, పి.సింగ్రు, పి.బేసు, ఎస్.సుందర్‌రాయ్, ఎస్.సంతన్న తదితరులు పాల్గొన్నారు.

ఎయు వృక్షశాస్త్ర విభాగానికి నూతన ప్రాజెక్టు



ప్రొఫెసర్లను అభినందిస్తున్న ఎయు విసి

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : ఆంధ్ర విశ్వవిద్యాలయం వృక్షశాస్త్ర విభాగం, బొటానికల్ గార్డెన్‌కు కేంద్ర ప్రభుత్వ అటవీ పర్యావరణశాఖకు చెందిన బొటానికల్ సర్వే ఆఫ్ ఇండియా నుంచి నూతన ప్రాజెక్టు మంజూరైంది. ఈ ప్రాజెక్టులో భాగంగా అంతరించిపోతున్న స్థానిక వృక్షజాతులను సేకరించి ఆంధ్ర విశ్వవిద్యాలయం వృక్ష శాస్త్ర విభాగ నర్సరీల ద్వారా సంరక్షిస్తారు. పర్యావరణంతో ముడిపడి ఉన్న నూతనప్రాజెక్టును సాధించడంపై ఎయు విసి ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. జాతీయ అంతర్జాతీయ సందర్శకులకు, విద్యార్థులకు, పరిశోధనలకు ఒక జ్ఞాన కేంద్రంగా ఇది నిలుస్తుందన్నారు. ప్రాజెక్ట్ ఇన్వెస్టిగేటర్లు ఆచార్య ఎస్‌బి పడాల్, ఆచార్య బి.సుజాత, ఆచార్య పికె.రత్నకుమార్, విభాగాధిపతి ఆచార్య డి.సంధ్యా దీపిక, ఆచార్య బి సంధ్యశ్రీ, ఆచార్య పి. బలరామస్వామి యాదవ్, విభాగ ఆచార్యులను అభినందించారు. కార్యక్రమంలో హెర్బెరియం మ్యూజియం క్యూరేటర్ డాక్టర్ జె. ప్రకాశరావు పాల్గొన్నారు

ఇరుకు రోడ్డులో ఆక్రమణలతో ఇక్కట్లు

ప్రజాశక్తి- వేపగుంట : గోపాలపట్నం నుండి కొత్తపాలెం వెళ్లే రహదారిలో నిత్యం వేలాది మంది ప్రయాణించే మార్గంలో ట్రాఫిక్ ఇబ్బందులతో వాహనదారులు, విద్యార్థులు, ప్రజలు అవస్థలు పడుతున్నారు. అసలే చిన్నరోడ్లు, ఆపై రోడ్లమీద ఆటోలు నిలిపేస్తుండగా, మరోవైపు ఈ మార్గంలో దుకాణదారులు రోడ్డును ఆక్రమించేసి పాకలు బడ్డీలు వేసుకోవడంతో రహదారి మరింత ఇరుకుగా మారి రాకపోకలకు కష్టాలు తప్పడం లేదు. రోడ్లు, కాలువల ఆక్రమణలను నియంత్రించాల్సిన జివిఎంసి యంత్రాంగంగానీ, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాల్సిన పోలీసులుగానీ ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దీనిపై స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

51వ వార్డు టిడిపి అధ్యక్షునిగా సనపల కీర్తి

ప్రజాశక్తి -మాధవధార : తెలుగుదేశం పార్టీ 51వ వార్డు అధ్యక్షులుగా సనపల కీర్తి నియమితులయ్యారు ఈ మేరకు నియామక పత్రాన్ని విశాఖపట్నం పార్లమెంటరీ నియోజకవర్గ టిడిపి అధ్యక్షులు గండి బాబ్జి అందజేశారు. ఈ సందర్భంగా వార్డులో పార్టీ బలోపేతానికి తద్వారా రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చేలా కృషి చేయాలని బాబ్జి సూచించారు. మాజీ కార్పొరేటర్ సనపల సీతారామాంజనేయులు కుమారుడు సనపల కీర్తికి పార్టీ వార్డు అధ్యక్ష పదవిని ఇవ్వడంపై పలువురు హర్షం వ్యక్తం చేసి అభినందించారు. ఈ సందర్భంగా సనపల కీర్తి మాట్లాడుతూ పార్టీ ఆదేశాలకు అనుగుణంగా పనిచేస్తానన్నారు.

'చైతన్య' విద్యార్థిని ఆత్మహత్యపై

సమగ్ర దర్యాప్తు జరపాలి

ప్రజాశక్తి -మధురవాడ : కొమ్మాది చైతన్య కళాశాలలో డిప్లమో విద్యార్థిని ఆత్మహత్యకు బాధ్యులపై కఠినచర్యలు చేపట్టాలని కోరుతూ ఎబివిపి ఆధ్వర్యంలో కుటుంబసభ్యులు కాలేజీ వద్ద నిరసన ఆందోళన చేపట్టారు. విద్యార్థి మృతికి యాజమాన్యం నిర్లక్ష్యమే కారణమని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక సిఐ వై.రామకృష్ణకు సమస్యను విన్నవించారు. దీనిపై సిఐ రామకృష్ణ స్పందిస్తూ, ఇప్పటికే సంఘటనపై పలుసెక్షన్లతోపాటు పోక్సోచట్టం కింద కేసు నమోదు చేశామన్నారు. కేసు దర్యాప్తునకు నగర పోలీస్‌కమిషనర్ ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారన్నారు. తొందరలోనే కేసు విచారణను కొలిక్కి తీసుకొచ్చి, నిందితులను పట్టుకుంటామన్నారు.

ఆరిలోవలో తుపాకీ కలకలం?

ప్రజాశక్తి - ఆరిలోవ : ఆరిలోవ ప్రాంతంలో తుపాకీతో హల్‌చల్ చేస్తున్న ఓ యువకుడిని ఆదివారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. ఈ విషయాన్ని ఆరిలోవ పోలీసులు గోప్యంగా ఉంచారు. ఇదే విషయాన్ని ఆరిలోవ సిఐని వివరణ అడిగితే, పూర్తి వివరాలు ఇప్పుడు చెప్పలేమని, త్వరలో వెల్లడిస్తామన్నారు.

ముడుపులు ముట్టాకే మౌనం..!

అయ్యన్నపాత్రుడిపై ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ విమర్శలు

ప్రజాశక్తి-గొలుగొండ:అనకాపల్లి ఎంపీ టికెట్ ఇతర ప్రాంతం వారికి ఇస్తే మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు ఎందుకు ఒప్పుకున్నారని, ఇప్పుడు ముడుపులు తీసుకొని వంగి వంగి దండాలు పెడుతున్నాని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఆరోపించారు. సోమవారం గొలుగొండ మండలం కృష్ణదేవిపేటలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. 40 ఇయర్స్ ఇండస్ట్రీ అని చెప్పుకునే అయ్యన్నపాత్రుడు అనకాపల్లి ఎంపీ సీటు తన కొడుక్కే ఇవ్వాలని, ఇతర ప్రాంతం వారికి ఇవ్వకూడదని బహిరంగ సభలో చెప్పారన్నారు. అలాంటి అయ్యన్నపాత్రుడు కడప నుంచి వచ్చిన వారికి ఎంపీ టికెట్ ఇస్తే ఎలా ఒప్పుకున్నారని, కేవలం కోట్లాది రూపాయలు ముడుపులు తీసుకొని అయ్యన్నపాత్రుడు వంగి వంగి దండాలు పెడుతున్నారని దుయ్యబట్టారు. అయ్యన్నపాత్రుడు, ఆయన కొడుకులు ప్యాకేజీ స్టార్స్ అని ఎద్దేవా చేశారు. అయ్యన్నపాత్రుడు అప్పట్లో ఊ.10 లక్షలతో దండి నూకాలమ్మ ఆలయాన్ని కట్టారని, తాము అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.40లక్షలు నిధులు తెచ్చి గుడి నిర్మాణాన్ని పూర్తి చేశామని చెప్పారు. రూ.128 కోట్లతో టిడ్కో గృహాలు 2018 మంజూరైతే 15 నెలల్లో పూర్తి కావాల్సి ఉన్నా టీడీపీ హయాంలో పూర్తి చేయలేదన్నారు. టీడీపీ హయాంలో కేవలం 35 కోట్లతోనే పని చేయించారన్నారు. జగన్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రూ.93 కోట్లతో పూర్తి చేశామన్నారు.

టిడ్కో గృహాల కాంట్రాక్టర్లను బెదిరించి రూ.10కోట్లతో ఇల్లు కట్టారని ఆరోపించారు. వెంకటేశ్వరస్వామి గుడి నుండి పెదబొడ్డేపల్లి వరకు టీడీపీ హయాంలో రూ.3 కోట్ల మంజూరు చేసినట్లు శిలాఫలకం ఉందని కానీ రోడ్డు వేయలేదన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.6కోట్లతో ఈ రోడ్డును పూర్తి చేశామన్నారు. పెద్దచెరువు వద్ద ట్యాంక్ బండ్ ఏర్పాటు చేస్తామని రూ.6కోట్లతో శంకుస్థాపన చేశారని, దాన్ని కూడా పూర్తి చేయలేదన్నారు. గ్రాఫిక్ చేసి ప్రజలను మభ్యపెట్టి రూ.6కోట్లు జేబులో వేసుకున్నారన్నారు.ప్రజల వద్ద సానుభూతి పొందాలనే ఉద్దేశ్యంతో ఇదే ఆయనకు చివరి ఎన్నికలంటూ అయ్యన్నపాత్రుడు మభ్య పెడుతున్నారన్నారు. మరో రెండు నెలల్లో అయ్యన్నపాత్రుడు కుటుంబ సభ్యులు అల్లిపుడి వెళ్లిపోవడం కాయమన్నారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ చిటికెల భాస్కర్ నాయుడు, జెడ్పీటీసీ గిరిబాబు పాల్గొన్నారు.

మూసేసిన క్యాంటీన్లను తెరిపించండి

- సిజిఎం వర్క్సుకు కార్మిక సంఘాల నేతల వినతి

ప్రజాశక్తి- ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్‌లో మూసేసిన క్యాంటీన్లను వెంటనే తెరిపించే ఏర్పాట్లు చేయాలని కార్మికులు కోరారు. ఈ మేరకు సోమవారం సిజిఎం వర్క్స్ సోధ్భీను కలిసిన కార్మిక సంఘాల నేతలు వినతిపత్రం అందజేశారు. సోమవారం ఉదయం నుంచి క్యాంటీన్లు మూసేయడం వల్ల టిఫిన్, మధ్యాహ్నం భోజనాలకు కార్మికులు తీవ్రమైన ఇబ్బంది పడ్డారని కార్మిక సంఘాల నేతలు విన్నవించారు. ఉద్యోగులు, కార్మికుల వేతనాలు సక్రమంగా చెల్లించని పరిస్థితుల్లో వారి జీతాల నుంచి కట్ అయి క్యాంటీన్ కాంట్రాక్టర్ చెల్లించాల్సిన నిధులు ఇవ్వకపోవడంతో క్యాంటీన్‌లను మూసేశారన్నారు. వెంటనే సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడి క్యాంటీన్‌ను తెరిపించే ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులు, ఉద్యోగులకు మధ్యాహ్న భోజనాలు, టిఫిన్లకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరారు. దీనిపై సిజిఎం వర్క్స్ సోధ్బీ స్పందిస్తూ క్యాంటీన్ యాజమాన్యాలతో మాట్లాడుతున్నామని, తక్షణమే తెరిపించేందుకు ప్రయత్నిస్తున్నామని, లేని పక్షంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని హామీనిచ్చారు. కాగా ఉద్యోగుల జీతాల చెల్లింపులపై నిర్దిష్ట సమయం చెప్పక పోవడంపై అసహనం వ్యక్తం చేసిన కార్మికసంఘాల నేతలు, తగు చర్యలు చేపట్టకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

నూతన క్రిమినల్ చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి -మధురవాడ: భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్షా అధినియం వంటి నూతన క్రిమినల్ చట్టాలపై గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ లా ఆధ్వర్యంలో నాలుగు రోజుల పాటు జరిగే అవగాహన సదస్సు సోమవారం ప్రారంభమైంది. ఒడిశా కిట్ విశ్వవిద్యాలయం మానవ హక్కుల చట్టాల విభాగం ఛైర్‌పర్సన్ ప్రొఫెసర్ భవానీ ప్రసాద్ పండా ముఖ్య అతిథిగా హజరై మాట్లాడారు.. ఇండియన్ పీనల్ కోడ్ చారిత్రక నేపథ్యంతో పాటు భారతీయ న్యాయ సంహిత గూర్చి వివరించారు. కార్యక్రమానికి గీతం స్కూల్ ఆఫ్ లా డైరక్టర్ ప్రొఫెసర్ అనితారావు అధ్యక్షత వహించారు.



ఎన్నికైన క్రెడాయ్ నూతన కార్యవర్గం

క్రెడాయ్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : 2024-25 సంవత్సరానికిగాను క్రెడాయ్ విశాఖపట్నం కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకొంది. ఎన్ఎడి కొత్త రోడ్డు సమీపంలోని మారియట్ హోటల్ ఫెయిర్‌ఫీల్డ్‌లో జరిగిన సాధారణ సమావేశంలో కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. క్రెడాయ్ విశాఖపట్నం చాప్టర్ చైర్మన్‌గా కెఎస్‌ఆర్‌కె.రాజు (సాయి), అధ్యక్షులుగా వి.ధర్మేందర్, ఉపాధ్యక్షులుగా ఇ.అశోక్ కుమార్, సిహెచ్.గోవిందరాజు, జి.విజయ్ కుమార్, గౌరవ కార్యదర్శిగా వి.శ్రీను, జాయింట్ సెక్రటరీలుగా కె.శ్రీనివాస్, పి.నరసింహారావు, జి.కార్తీక్, కోశాధికారిగా కెవిఆర్.రాజు (రమేష్), కమిటీ సభ్యులుగా ఎం.కృష్ణమోహన్ రావు, గణపతిరాజు రాజేష్, ఎ.శ్రీనివాసరావు, పవన్ శంక, ఆర్.సుబోధ్ కుమార్, ఆర్.కిరణ్ కుమార్ ఎన్నికయ్యారు. తాజా ఎన్నిక వివరాలను క్రెడాయ్ విశాఖపట్నం గౌరవ కార్యదర్శి వి.శ్రీను తెలిపారు. ఎన్నికల కమిటీ సభ్యులుగా కెఎస్.చంద్రన్, రామకృష్ణారావు వ్యవహరించారు.

విద్యార్థిని ఆత్మహత్య కారకులను శిక్షించండి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : నగరంలోని కొమ్మాది చైతన్య ఇంజినీరింగ్ అండ్ పాలిటెక్నిక్ కాలేజీలో మొదటి సంవత్సరం డిప్లమో చదువుతున్న విద్యార్థిని లైంగిక వేధింపుల కారణంగా ఆత్మహత్య చేసుకుందని, ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షులు టి.శ్రీరామమూర్తి, జిల్లా అధ్యక్షులు వై.నూకరాజు ఒక ప్రకటనలో సోమవారం కోరారు. నిందితులు ఎంతటి వారైన కఠినంగా శిక్షించాలన్నారు. బోధనా సిబ్బంది వేధింపులు తాళలేక ఈ ఆత్మహత్యకు పాల్పడినట్లు సదరు విద్యార్థి వాట్సాప్ ద్వారా మెసేజ్ పంపినట్టు కుటుంబ సభ్యుల చెబుతున్న విషయాన్ని గుర్తుచేశారు.

బాబువి కుటిల రాజకీయాలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు చేస్తున్న కుటిల రాజకీయాలను ఎవరూ నమ్మవద్దని, ఇంటింటికీ వాలంటీర్లు వచ్చి పింఛన్లు పంపిణీ చేసే ప్రక్రియను ఆయనే అడ్డుకున్నారని వైసిపి ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ అన్నారు. సోమవారం జివిఎంసి 39వ వార్డులో వారు విస్తృతంగా ప్రచారం చేశారు. సమర్థులైన నాయకులను ప్రజలు ఎన్నుకోవాలన్నారు. వాలంటీర్లపై నేడు పిచ్చుకపై బ్రహ్మాస్త్రం వేసినట్లుగా చంద్రబాబు వ్యవహరించారని విమర్శించారు.

పోర్టు ట్రాఫిక్ మేనేజర్‌కు ఘన సత్కారం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : 2023 - 24 ఆర్థిక సంవత్సరంలో సరుకు రవాణాలో విశాఖపట్నం పోర్టు నూతన రికార్డులను నెలకొల్పి చరిత్ర పుటల్లో తన పేరును పునర్లిఖించిన సందర్భంగా పోర్టు ఛైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు ఈ ఘనతను సాధించడంలో కృషి చేసిన ట్రాఫిక్ మేనేజర్ బి.రత్నశేఖరరావును ఘనంగా సత్కరించారు. పోర్టు చరిత్రలోనే అత్యధిక సరుకు రవాణా చేయడంలో రత్నశేఖరరావు పాత్ర ఎనలేనిదని కొనియాడారు. ఆయన కృషి, నిరంతర శ్రమతోనే తాజా రికార్డు సాధ్యమైందన్నారు. పోర్టు పరిపాలన భవనంలోని బోర్డు రూంలో సోమవారం జరిగిన ఈ ప్రత్యేక కార్యక్రమంలో పోర్టు ఉన్నతాధికారులు, పోర్టు చీఫ్ విజిలెన్స్ అధికారి పిఎస్ఎల్.స్వామి, కార్యదర్శి టి.వేణుగోపాల్, పోర్టు విభాగాధిపతులు పాల్గొన్నారు.

తూర్పులో టిడిపి ప్రచారం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ తూర్పు నియోజకవర్గ పరిధిలోని విజయనగర ప్యాలెస్ లేఅవుట్ ప్రాంతంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పట్టాభిరామ్ అధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్ళి కరపత్రాలు పంపిణీ చేసి విశాఖ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యేగా వెలగపూడి రామకృష్ణబాబును, ఎంపీగా మతుకుమిల్లి శ్రీ భరత్‌ను గెలిపించాలని కోరారు.

పెరుగుతున్న ఎండలు

రాగల రెండు రోజులూ వడగాల్పుల ప్రభావం
ఇప్పటికే జనం విలవిల - శీతల పానీయాలకు డిమాండ్
ఈ ఏడాది పెరగనున్న సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

నగరంలో ఎండలు క్రమంగా పెరుగుతున్నాయి. సోమవారం విశాఖలో భానుడు దంచికొట్టాడు. మధ్యాహ్నం 1 గంట నుంచి 3.30 గంటల వరకూ దాదాపు రోడ్లన్నీ నిర్మానుష్యంగానే కనిపించాయి. ఉష్ణోగ్రతల్లో వస్తోన్న మార్పులతో వేడి గాలుల తీవ్రత కూడా క్రమేపీ పెరుగుతోంది. సాధారణ ఉష్ణోగ్రతలు 32 డిగ్రీలు ఉండాల్సి ఉండగా పలుచోట్ల నగరంలో 34 డిగ్రీల వరకూ ఆది, సోమవారాల్లో నమోదయ్యాయి. వాతావరణ శాఖ అధికారుల అంచనాల ప్రకారం ఈ ఏడాది ఎండలు మండనున్నాయి. జూన్ వరకూ ఈ ఎండల తీవ్రత ఉంటుందని సోమవారం అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. అలాగే వేడి గాల్పులూ ఈ సంవత్సరం అధికమే. సముద్రాలు క్రమంగా వేడెక్కుతున్న సంగతి తెలిసిందే. దీంతో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు ఈ ఏడాది పెరిగి ప్రజలకు కొన్ని రోజుల పాటు తీవ్ర అసౌకర్యం ఏర్పడే అవకాశాలు ఉన్నట్లు వాతావరణ కేంద్రం వెల్లడించింది. సోమవారం విశాఖలో వేడి గాల్పులు వీచాయి. వేడి, తేమతో ప్రజలు అసౌకర్యానికి గురయ్యారు. గరిష్ట ఉష్ణోగ్రతలు రాగల రెండు రోజుల్లో ఉమ్మడి విశాఖ జిల్లా అంతటా కనీసంగా 2 డిగ్రీల వరకూ పెరిగే అవకాశం ఉంది. ఈ ఏడాది సాధారణ ఉష్ణోగ్రతలు అతి తక్కువ రోజులే ఉంటాయని వాతావరణ కేంద్రం అధికారుల తాజా నివేదిక వెల్లడిస్తోంది. పర్యావరణ అసమతుల్యత కారణంగా వాతావరణంలో అసహజమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా ఎండల వేడిమితో శీతల పానీయాలకు డిమాండ్ పెరిగింది. జ్యూస్ సెంటర్లు, చెరుకు బండ్లు, కొబ్బరి బొండాల దుకాణాల వద్ద జనతాకిడి పెరిగింది.



ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు శీతల పానీయం తాగుతున్న విద్యార్థులు

వికలాంగుల అంశాలను మ్యానిఫెస్టోల్లో చేర్చాలి



మాట్లాడుతున్న వికలాంగుల నెట్‌వర్క్ నాయకులు శ్రీనివాసులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వికలాంగుల అంశాలను రాజకీయ పార్టీలు తమ ఎన్నికల మ్యానిఫెస్టోల్లో చేర్చాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో వికలాంగుల నెట్‌వర్క్, పూర్ణమిధం సంఘాల నిర్వహణలో నేషనల్ సెంటర్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఎంప్లాయిమెంట్ ఫర్ డిజేబుల్డ్ పీపుల్ (న్యూఢిల్లీ) సౌజన్యంతో సోమవారం ఏర్పాటు చేసిన దక్షిణ భారత ప్రాంతీయ సదస్సులో 'రాజకీయ క్షేత్రంలో వికలాంగుల పాత్ర' అన్న అంశంపై పలువురు మాట్లాడారు. తెలుగు రాష్ట్రాల ప్రతినిధులు, పలు వికలాంగుల హక్కుల సంఘాల నేతలు పాల్గొన్నారు. రాబోయే ఎన్నికల్లో వికలాంగులను రాజ్యాధికారంలో భాగస్వాములను చేయాలన్నారు. మూడు కోట్ల మందికిపైగా జనాభా ఉన్న వికలాంగుల అభివృద్ధి కోసం సమగ్రమైన మ్యానిఫెస్టో అవసరమన్నారు. రాబోయే ఎన్నికల్లో 21 రకాల వికలాంగులను పోలింగ్ బూత్‌ల వారీగా గుర్తించి వారి వారి వైకల్యాలను బట్టి అనుకూల ఓటింగ్ సౌకర్యాలు కల్పించాలని ఎన్నికల అధికారులను కోరారు. ఈ సందర్భంగా వికలాంగుల మ్యానిఫెస్టో పోస్టర్‌ను, ప్రతిని అవిష్కరించారు. సెమినార్‌లో న్యూఢిల్లీకి చెందిన ఎన్‌సిపిఇడిపి ప్రతినిధి అక్షయ్, వికలాంగుల నెట్‌వర్క్ తెలుగు రాష్ట్రాల ఇన్‌ఛార్జి నల్గొండ శ్రీనివాసులు, సంస్థ ప్రతినిధి ఇనుముల సతీష్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇంచార్జి జీలకర్ర రమణ, పూర్ణమిధం సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు కావ్య పూర్ణిమ, వైజాగ్ వలంటీర్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.సతీష్ పాల్గొన్నారు.



గ్రూపులుగా విడిపోయి ఘర్షణ పడుతున్న టిడిపి కార్యకర్తలు

కూటమి సమావేశంలో తెలుగు తమ్ముళ్ల వీరంగం

- జనసేనకు టికెట్ కేటాయించడంపై మండిపాటు
- కుర్చీలు విసురుకున్న వైనం

ప్రజాశక్తి - యలమంచిలి : టిడిపి, జనసేన, బిజెపి కూటమిలో విభేదాలు నివురుగప్పిన నిప్పులా ఉన్నాయి. అవి పలుచోట్ల బయటపడుతూ వస్తున్నాయి. యలమంచిలిలో సోమవారం ఈ సీన్ మళ్లీ కనిపించింది. అధిష్టానం సూచన మేరకు టిడిపి జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు అధ్యక్షతన సోమవారం పొత్తులో అనుసరించాల్సిన వ్యూహంపై యలమంచిలి మెయిన్‌రోడ్డు సమీపంలో నియోజకవర్గ స్థాయి సమన్వయ కమిటీ ఆత్మీయ సమావేశాన్ని సీనియర్ నాయకులు, మాజీ ఎంపీ పప్పల చలపతిరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ప్రగడ నాగేశ్వరరావుతో పాటు సీనియర్ నాయకులందరికీ సమావేశ వివరాలు తెలియజేశారు. అయితే, సమావేశం మొదలైన తర్వాత కార్యకర్తలు ప్రగడకు అనుకూలంగా నినాదాలు చేస్తూ టికెట్ దక్కాల్సిన ప్రగడకు మొండిచేయి చూపడం సరికాదని, ఆయనకే టిక్కెట్ వచ్చేలా అధిష్టానంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. జనసేనకు ఈ టికెట్ కేటాయించడం సరికాదన్నారు. మొత్తానికి తెలుగు తమ్ముళ్లు రెండు గ్రూపులుగా చీలి ఒకరినొకరు తోసుకున్నారు. కుర్చీలు విసిరికొట్టారు. అనంతరం ప్రగడ నాగేశ్వరరావు మాట్లాడుతూ తన ఆధ్వర్యంలో జరగాల్సిన సమావేశాన్ని పప్పల చలపతిరావు నిర్ణయించడమేంటని, సమవేశాన్ని వాయిదా వేస్తున్నానని ప్రకటించారు. త్వరలోనే మరో సమావేశం ఏర్పాటు చేస్తానని ఆయన వెళ్లిపోవడంతో నాయకులంతా విస్తుపోయారు.

అనంతరం పప్పల చలపతిరావు మాట్లాడుతూ కూటమి పొత్తు ఖరారైన తర్వాత తెలుగుదేశం, జనసేన, బిజెపికి చెందిన నాయకులు కలిసి పనిచేయడానికి అధిష్టానం నిర్ణయించిందని, యలమంచిలి అసెంబ్లీ నియోజకవర్గం పొత్తులో భాగంగా జనసేనకు కేటాయించారని, ఈ క్రమంలోనే ఆ పార్టీ నేత సుందరపు విజయకుమార్ అన్ని పార్టీలను కలుపుకొని ప్రచారం ప్రారంభించారని తెలిపారు. అయితే బహిరంగంగా మూడు పార్టీల నాయకులూ ఒకే వేదిక పై నుంచి ప్రచారం మాత్రం మొదలు పెట్టలేదన్నారు.

ఈ క్రమంలో అధిష్టానం సూచన మేరకు జిల్లా అధ్యక్షులు నాగజగదీశ్వరరావు అధ్యక్షతన సోమవారం పొత్తులో అనుసరించాల్సిన వ్యూహం గురించి మాట్లాడడానికి అందరికీ చెప్పి సమావేశం ఏర్పాటు చేశానని తెలిపారు. ఇలా రసాభాసకు పాల్పడడం సబబుకాదని అన్నారు. సమావేశానికి నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన సీనియర్ నాయకులు, కార్యకర్తలు, మండల పార్టీ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, మాజీ సర్పంచ్‌లు హాజరయ్యారు. సమావేశం రసాభాస సంగతి తెలుసుకొని బిజెపి అనకాపల్లి పార్లమెంట్ అభ్యర్థి సిఎం.రమేష్ తమ్ముడు వచ్చి పప్పల చలపతిరావును కలిసినట్టు తెలిసింది.

ఘనంగా ఎఎఐ 29వ వార్షికోత్సవం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎయిర్ పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా 29వ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ఉదయం విశాఖపట్నం విమానాశ్రయంలో ఘనంగా జరిగాయి. ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ ఎస్.రాజారెడ్డి, ఎఎఐకి చెందిన ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ గత ఏడాది విశాఖ ఎయిర్ పోర్టులో అత్యధికంగా 29.26 లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగించారన్నారు. చెక్ పాయింట్లలో ఒకదాన్ని తగ్గించడం, చెక్ ఇన్ కౌంటర్లను 32 నెంబర్లకు పెంచడం, ముందస్తు భద్రతా తనిఖీ సౌకర్యాలను పెంచడం, అరైవల్ ప్రాంతంలో పునరుద్ధరించిన టాయిలెట్ సౌకర్యాలు, మనీ ఎక్స్ఛేంజ్, ఎగ్జిక్యూటివ్ లాంజ్ వంటి కొత్త సౌకర్యాలు సరికొత్త అనుభూతిని కలిగిస్తాయన్నారు. గడిచిన కాలంలో ప్రయాణికుల స్నేహపూర్వక కార్యక్రమాలను చేపట్టామని వెల్లడించారు.